పాఠశాలల్లో అభివృద్ధి పనుల పరిశీలన

ధర్పల్లి, జూన్ 11: మండలంలో కోటాల్‌పల్లి, హోన్నాజీపేట్, వాడీ తదితర గ్రామాలో ఎంపీడీవో బాలకృష్ణ మంగళవారం పర్యటించారు. అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద చేపట్టి అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో మిగతా పనులు పూర్తి చేయాలని సూచించారు. వర్షాకాలం ప్రారంభమైనందున గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చూడాలని తాగు నీరు, పైపులైన్ లీకేజీలు ఉంటే వెనువెంటనే మరమ్మతులు చేయించాలని కార్యదర్శులకు సూచించారు. ముఖ్యంగా పారిశుద్ధ్య నిర్వహణపై దృష్టి సారించాలని ఆదేశించారు. విధి నిర్వహణలో కార్యదర్శులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మ్యాక్స్ సంఘాలు సకాలంలో రుణాలు చెల్లించాలి

డిచ్‌పల్లి, జూన్ 11 : మ్యాక్స్ సంఘాలు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించి సంఘాల అభివృద్ధికి తోడ్పడాలని ఇంటి దీపం ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘం అధ్యక్షురాలు రాజమణి అన్నారు. మంగళవారం డిచ్‌పల్లి షాదీఖానాలో నిర్వహించిన సంఘం 23వ సమావేశంలో ఆమె మాట్లాడారు. మ్యాక్స్ సంఘాల్లో 1546 మంది సభ్యులున్నారని, సంఘాలకు రూ. 7,08,781 లాభాలు వచ్చినట్లు తెలిపారు. ఇప్పటివరకు ఆటో కొనుగోళ్లు, చిన్నచిన్న వ్యాపారాల ఏర్పాటు కోసం రుణాలు ఇచ్చినట్లు పేర్కొన్నారు. రుణాలు సకాలంలో చెల్లించాలని సూచించారు. సమావేశంలో మ్యాక్స్ మేనేజర్ సర్వోన్నతరావు, సిబ్బంది గజ్‌బీర్కర్, సంతోషి, స్వప్న మహిళలు పాల్గొన్నారు.

మల్కాపూర్ తండాలో నర్సరీ పరిశీలన

నర్సరీలోని మొక్కలను పరిశీలిస్తున్న ఏపీవో పద్మ

సారంగాపూర్, జూన్ 11 : నిజామాబాద్ రూరల్ మండలంలోని మల్కాపూర్ తండాలో నర్సరీని మంగళవారం ఏపీవో పద్మ, టెక్నికల్ అసిస్టెంట్ హరీందర్ సందర్శించారు. నర్సరీలోని మొక్కలను పరిశీలించారు. మొక్కలు ఎండిపోకుండా చూడాలని నిర్వాహకులకు సూచించారు.

అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలి

కోటగిరి, జూన్ 11: మండలంలోని జర్నలిస్టు కాలనీలో ప్రభుత్వ స్థలాన్ని అక్రమించుకొని ఇల్లు నిర్మాణం చేపడుతున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు మంగళవారం కోటగిరి తహసీల్ ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ సునీతకు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సీపీఐ మండల కార్యదర్శి విఠల్‌గౌడ్, నాయకులు నల్ల గంగాధర్, గోపి, దుబాయ్ సాయిలు, సున్నం పురుషోత్తం, దత్తు, శంకర్, రాజన్న తదితరులు ఉన్నారు.

14న వాహనాల వేలం

వినాయక్‌నగర్, జూన్ 11: నిజామాబాద్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఆధ్వర్యంలో సీజ్ చేయబడిన వాహనాల వేలం ఈ నెల 14న నిర్వహించనున్నట్లు ఏఈఎస్ సోమిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కండీషన్ సరిగా లేని, కాలం చెల్లిన మహేంద్ర జీప్‌తో పాటు రెండు టాటా సుమోలను వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు వేలంలో పాల్గొనవచ్చని సూచించారు.

నేటి నుంచి పాఠశాలల్లో దుస్తులు పంపిణీ చేయాలి

సారంగాపూర్, జూన్ 11: జిల్లాలో బుధవారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభమవుతున్న నేపథ్యంలో నేటి నుంచి ఏకరూప దుస్తులను విద్యార్థులకు పంపిణీ చేయాలని డీఆర్డీవో సాయాగౌడ్ సూచించారు. మంగళవారం కొత్తపేట్, గాంధీనగర్ పాఠశాలల్లో విద్యార్థుల కోసం కుట్టించిన ఏకరూప దుస్తులను ఆయన హెడ్మాస్టర్లకు అప్పగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మండలంలోని కొత్తపేట్, గాంధీనగర్ తండా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేసిన ఏకరూప దుస్తులను అందించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో మధురిమ, ఏపీఎం మహేశ్‌కుమార్, ఉపాధిహామీ టీఏ ప్రభాకర్‌రెడ్డి, వీవో అధ్యక్షులు, డ్వాక్రా మహిళ సంఘ సభ్యులు, హెడ్మాస్టర్లు పాల్గొన్నారు.

కొత్తపేటలో హైస్కూల్ హెడ్మాస్టర్‌కు ఏకరూప దుస్తులను అందజేస్తున్న డీఆర్డీవో సాయాగౌడ్

నేడు ఏకరూప దుస్తుల పంపిణీ

కోటగిరి, జూన్ 11: మండల కేంద్రంలో బుధవారం ప్రభుత్వ పాఠశాల పునః ప్రారంభం సందర్భంగా ఎంపీపీ సునీత చేతుల మీదుగా విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఎంపీవో మారుతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు హరిజనవాడ స్కూల్, 11 గంటలకు పొతంగల్ మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాం, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తారని ఆయన పేర్కొన్నారు.

నగరంలో మందుబాబుల హల్‌చల్

- అర్ధరాత్రి మద్యం మత్తులో హంగామా
- డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్ కాలర్ పట్టుకున్న వైనం
- ఇద్దరిపై కేసు నమోదు.. రిమాండ్‌కు తరలింపు

వినాయక్‌నగర్, జూన్ 11: నగరంలో మందుబాబుల ఆగడాలకు అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. అర్ధరాత్రి వరకు పీకలదాకా తాగి ఇష్టారీతిన వ్యవహరిస్తూ నానా హంగామా చేస్తున్నారు. దారిన పోయేవారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఇలా ఇబ్బందులకు గురైన వారి ఫిర్యాదు మేరకు సంఘటనాస్థలానికి చేరుకొన్న ఓ కానిస్టేబుల్ కాలర్ పట్టుకొని మందుబాబులు తిరగబడ్డారు. ఈ సంఘటన సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఇద్దరు యువకులు పుల్లుగా మందు తాగి ఆరో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సారంగాపూర్ వద్ద ఉన్న ఓ హోటల్‌కు సోమవారం అర్ధరాత్రి అనంతరం భోజనం చేసేందుకు వచ్చారు. భోజనం అనంతరం బిల్లు కట్టే విషయంలో వెయిటర్, మందుబాబుల మధ్య గొడవ జరిగింది. పుల్లుగా మద్యం మత్తులో ఉన్న సదరు యువకులు నేరుగా డయల్-100కు కాల్ చేసి హోటల్ నిర్వాహకులు తమపై దాడి చేశారని ఫిర్యాదు చేశారు. దీంతో ఆరోటౌన్‌లో నైట్ డ్యూటీలో ఉన్న శ్రీనివాస్ అనే కానిస్టేబుల్ రాత్రి సుమారు 2 గంటలకు అక్కడికి చేరుకొన్నారు. విషయం తెలుసుకునేందుకు ప్రయత్నం చేయగా.. మద్యం మత్తులో ఉన్న జీసాన్, అఫ్రోజ్ అనే యువకులు కానిస్టేబుల్‌పై నోటికి వచ్చినట్లు మాట్లాడుతూ ఆయన కాలర్ పట్టుకొని తిరగబడ్డారు. దీంతో స్థానికుల సహాయంతో మందు బాబులను అదుపులోకి తీసుకొని వారిపై కేసు నమోదు చేసిన్నట్లు సౌత్ రూరల్ సీఐ ఎన్.సురేశ్ కుమార్ తెలిపారు. డ్యూటీలో ఉన్న సిబ్బందిపై తిరగబడి, విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

కానిస్టేబుల్‌తో మందుబాబుల వాగ్వాదం

అత్తింటి వేధింపులు తాళలేక
యువకుడి ఆత్మహత్య

వినాయక్‌నగర్, జూన్ 11: అత్తింటి వేధింపులు తాళలేక ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన జిల్లా కేంద్రంలోని నసీంకాలనీలో చోటుచేసుకున్నది. నాల్గోటౌన్ ఎస్సై సంజీవ్ తెలిపిన వివరాల ప్రకారం.. నసీంకాలనీకి చెందిన మహ్మద్ అన్వర్(35) తన భార్యతో గొడవ జరగడంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. ఏడు నెలల క్రితం పుట్టింటికి వెళ్లిన భార్య తిరిగిరాలేదు. ఈ క్రమంలో అన్వర్ మంగళవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడాడు. మృతుడి వద్ద సూసైడ్ నోట్ లభించగా..అందులో తనను తన భార్య, అత్త,మామ, బావలు అందరూ కలిసి వేధిస్తున్నారని, వారి వేధింపులు భరించలేక ఆత్మహత్య చేసుకుంటున్నట్లు పేర్కొన్నాడు. మృతుడి తండ్రి ఇస్మాయిల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రుద్రూర్ పీహెచ్‌సీలో బీసీజీ వ్యాక్సిన్‌పై శిక్షణ

శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు

రుద్రూర్, జూన్11: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో బీసీజీ వ్యాక్సిన్‌పై ఆరోగ్య సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆయేషా సిద్దిఖా మాట్లాడుతూ.. బీసీజీ వ్యాక్సిన్ 18 ఏండ్లు నిండిన వారికి మాత్రమే ఇవ్వాలని సూచించారు. ఈ వ్యాక్సిన్ టీబీ నివారణకు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా టీబీ కో-ఆర్డినేటర్ రవిగౌడ్, ఎస్‌టీఎల్‌ఎస్ పద్మ, హెచ్‌ఈవో రాజేందర్, సూపర్‌వైజర్లు రవి, శృతి, సావిత్రి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశలు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఐటీఐల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఖలీల్‌వాడి జూన్ 11: నిజామాబాద్ జిల్లాలోని ఐదు ప్రభుత్వ ఐటీఐల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కన్వీనర్ కోటిరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా చేసుకోవాలని, ఈ నెల 14వరకు అడ్మిషన్లు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఐదు ప్రభుత్వ ఐటీఐల్లో 488 సీట్లు ఉన్నాయని తెలిపారు. ఇతర వివరాలకు 9948195654, 9490057403 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

'టీటీసీ' పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

ఖలీల్‌వాడి, జూన్ 11: టీటీసీ (టెక్నికల్ టీచర్ సర్టిఫికెట్ కోర్సు) 42 రోజులు శిక్షణ పూర్తిచేసుకున్న అభ్యర్థులకు థియరీ పరీక్షలు నిర్వహించనున్నారని, ఇందుకోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు డీఈవో దుర్గా ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ పూర్తిచేసుకున్నవారితోపాటు గతంలో థియరీ పరీక్షలో ఫెయిలైన అభ్యర్థులు సైతం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పరీక్షకు సంబంధించిన ఫీజు రూపాయలు ఈ నెల 18వరకు చెల్లించి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అపరాధ రుసుము 50 రూపాయలతో ఈ నెల 24 వరకు చెల్లించవచ్చని పేర్కొన్నారు. www.bse,talangana.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

27, 28వ తేదీల్లో లలితాశ్రమ వార్షికోత్సవం

సుభాష్‌నగర్, జూన్ 11: న్యాల్‌కల్ రోడ్‌లోని లలితాదేవి ఆశ్రమాలయంలో పంచముఖి దుబ్బ రాజేశ్వరస్వామి సహిత ద్వాదశ జ్యోతిర్లింగాలను ప్రతిష్టించి 21 ఏండ్లు పూర్తయిన సందర్భంగా ఈనెల 27, 28వ తేదీల్లో వార్షికోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపకులు వేలేటి రాజేందర్ శర్మ తెలిపారు. మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

మిషన్ భగీరథ కనెక్షన్లపై ఇంటింటి సర్వే

కోటగిరిలో సర్వేచేస్తున్న ఎంపీవో మారుతి

కోటగిరి/ చందూర్/మోర్తాడ్, జూన్ 11: కోటగిరి మండల కేంద్రంలో మంగళవారం మిషన్ భగీరథ కుళాయి కనెక్షన్లపై సర్వే చేపట్టారు. ప్రతి ఇంటిలో మిషన్ భగీరథ, జీపీ తాగునీటి సౌకర్యం ఉందా లేదా అని తెలుసుకొన్నారు. గ్రామంలో పూర్తిగా తాగునీటి కనెక్షన్ లేని వారి గురించి ఆరా తీశారు. ప్రతి ఇంటికీ వెళ్లి నల్లా కనెక్షన్ ఉన్నా లేకున్నా సర్వే చేసి వివరాలను మిషన్ భగీరథ యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో మారుతి తెలిపారు.

'భగీరథ' అధికారులకు సహకరించాలి

చందూర్ మండల కేంద్రంలో మంగళవారం నుంచి నల్లాల సర్వే చేపట్టిన మిషన్ భగీరథ అధికారులకు గ్రామస్తులు సహకరించాలని పంచాయతీ కార్యదర్శి సాయిలు సూచించారు. సర్వేకు వచ్చిన అధికారులకు ఆధార్, ఫోన్ నంబర్, కుటుంబవివరాలు ఇచ్చి సహకరించాలని ఒక ప్రకటనలో కోరారు.

మోర్తాడ్, కమ్మర్‌పల్లి మండలాల్లో మిషన్‌భగీరథ నల్లా కనెక్షన్లపై ఇంటింటి సర్వే ప్రారంభమైంది. గ్రామాలవారీగా కార్యదర్శుల ఆధ్వర్యంలో ఈసర్వే కొనసాగుతోంది. గ్రామాల్లోని ప్రతి ఇంటికీ గతంలో జీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నల్లా కనెక్షన్ ఉందా, మిషన్‌భగీరథ కనెక్షన్ ఉందా, అసలు నల్లా కనెక్షన్ లేదా అనే అంశంపై సర్వే నిర్వహిస్తున్నారు.

మహిళా సంఘంలో రూ.3 లక్షల దుర్వినియోగం

బోధన్ రూరల్, జూన్ 11: బోధన్ మండలంలోని అమ్దాపూర్ గ్రామ మహిళా సంఘంలో సుమారు రూ.3 లక్షలు దుర్వినియోగం అయినట్లు జిల్లా సెర్ప్ అధికారులు తెలిపారు. గ్రామ మహిళా సంఘంలో రూ.8 లక్షల నిధులు దుర్వినియోగమైనట్లు పలు డ్వాక్రా సంఘాల సభ్యులు గతంలో జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన అధికారులు మంగళవారం గ్రామంలో విచారణ చేపట్టారు. మహిళా సంఘాలు రికార్డులను తనిఖీ చేశారు. వీవోఏ అరుణ సుమారు రూ. 3లక్షల మేర నిధులు దుర్వినియోగం చేసినట్లు అధికారులు గుర్తించారు. ఈ విషయాన్ని ఉన్నత అధికారులకు నివేదించారు.

పది రోజుల్లో తిరిగి చెల్లించాలని అధికారుల ఆదేశం..

నిధుల అక్రమాలకు పాల్పడిన వీవోఏ అరుణ పది రోజుల్లోగా నిధులను తిరిగి చెల్లించాలని అధికారులు ఆదేశించారు. నిర్ణీత గడువులోగా చెల్లించకపోతే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సెర్ప్ రీజినల్ మేనేజర్ రాందాస్, సీఆర్పీలు వీణ, రాణి, ఏపీఎం గంగారాం, సీసీలు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రంలో పట్టపగలే చోరీ
నిందితులను పట్టుకున్న సిబ్బంది

ఆర్మూర్‌టౌన్, జూన్11: మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రంలో వరుస చోరీలు జరుగుతున్నాయి. శుక్రవారం రాత్రి జరిగిన చోరీలో ఒక సిలెండర్, ఒక ఫ్యాన్, రెండు బీపీ మిషన్ ప్యాడ్లు దొంగలు ఎత్తుకెళ్లారు. మళ్లీ మంగళవారం ఉదయం ఏఎన్ఎంలు కాలనీలో విధులు నిర్వహించుకొని తిరిగి వచ్చేసరికి లోనికి ఇద్దరు ప్రవేశించి చోరీకి పాల్పడుతున్నారు. వారిని స్థానికుల సాయంతో సిబ్బంది పట్టుకొని పోలీసులకు సమాచారం అందించారు. శుక్రవారం రాత్రి కూడా తామే దొంగతనం చేసి వస్తువులను ఓ పాత సామగ్రి దుకాణంలో విక్రయించినట్లు తెలిపారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని నిందితులను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో రవి కుమార్ తెలిపారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి

ఆర్మూర్‌టౌన్,జూన్11: పట్టణంలోని రాజరాంనగర్‌లో ఉన్న అమ్మ ఆదర్శ పాఠశాలలో కొనసాగుతున్న మరమ్మతు పనులను మున్సిపల్ కమిషనర్ రాజు మంగళవారం పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు.

ప్రైవేటు పాఠశాలల్లో పుస్తకాలు విక్రయిస్తే చర్యలు

శక్కర్‌నగర్, జూన్ 11: విద్యార్థులు తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని బోధన్, సాలూరా మండలాల విద్యాధికారి నాగనాథ్ సూచించారు. ప్రైవేట్ పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు విక్రయిస్తే చర్యలు చేపడతామని హెచ్చరించారు. ప్రైవేట్ పాఠశాలల్లో నోటు పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు అమ్మితే తమ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు.

చట్టానికి అందరూ సమానమే

ఆర్మూర్‌టౌన్, జూన్11: తమ భవిష్యత్ కార్యాచరణపై సభ్యులతో చర్చించినట్లు నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ జస్టిస్ మూమెంట్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎస్‌కే హనీస్ తెలిపారు. పట్టణంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సాంఘిక, కుల బహిష్కరణలు జరగకుండా అందరూ చూడాలని, చట్టానికి అందరూ సమానమేనని అన్నారు.

రుణాలు క్రమం తప్పకుండా చెల్లించాలి

మాక్లూర్, జూన్ 11: ఇంటి దీపం ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘం వార్షిక మహాజనసభ బోపతి చిన్నమ్మ అధ్యక్షతన మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించారు. 2023-24లో సంఘం సభ్యులకు రూ.4 కోట్ల 58 లక్షల రుణాలు ఇప్పించినట్లు తెలిపారు. ఈ సంవత్సరం రూ.20 లక్షల వరకు లాభాలు వచ్చాయని అధ్యక్షురాలు తెలిపారు. సమావేశంలో మండల కోఆప్షన్ సభ్యుడు అహ్మద్, సంఘ డైరెక్టర్లు పెద్దమ్మ, పుష్ప, చంద్రకళ, వల్లమ్మ, మ్యాక్స్ మేనేజర్ ప్రభాకర్ పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

మాక్లూర్/ ధర్పల్లి/ ఇందల్వాయి/ రుద్రూర్/ రెంజల్, జూన్ 11: మాక్లూర్, జూన్ 11: మాక్లూర్ మండల కేంద్రంతోపాటు బోర్గాం(కె) గ్రామాల్లో మంగళవారం ఉపాధ్యాయులతో కలిసి జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు బడిబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలలో చేర్పిస్తే ట్రిపుల్ ఐటీ లాంటి కళాశాలల్లో సీటు వస్తుందన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద ఎంపికైన పాఠశాలల్లో కొనసాగుతున్న పనులను అధికారులతో కలిసి తనిఖీ చేశారు. కృష్ణానగర్‌లో మిషన్ భగీరథ నీరు సరఫరా అవుతుందా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జైక్రాంతి, పీఆర్ ఏఈ శ్రీనివాస్, కార్పొరేటర్ రాయసింగ్, ఎంపీటీసీ వెంకటేశ్వర్‌రావు, కోఆప్షన్ సభ్యుడు అహ్మద్, కార్యదర్శి రాకేశ్ పాల్గొన్నారు.

ఎన్నో వసతులతోపాటు మెరుగైన విద్య ప్రభుత్వ పాఠశాలల్లోనే అందుతుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ధర్పల్లి మండలంలోని దమ్మన్నపేట్ ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు కోరారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా వారు దమ్మన్నపేట్‌లో ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాంచందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు. ఇందల్వాయి మండలంలోని అన్ని గ్రామాల్లో బడిబాటలో భాగంగా ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులను చేర్పించాలని కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. రెంజల్ మండలంలోని పేపర్‌మిల్ ప్రాథమిక పాఠశాలలో బడీడు పిల్లలను గుర్తించినట్లు హెచ్ఎం గంగాధర్ తెలిపారు. ఉర్దూ, తెలుగు మీడియం పాఠశాలలో చేర్పించేందుకు బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇంటింటా తిరుగుతూ గుర్తించిన పిల్లలకు ప్రవేశం కల్పిస్తున్నట్లు తెలిపారు. దూపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో పలువురు విద్యార్థులను చేర్పించినట్లు పీఆర్టీయూ మండల అధ్యక్ష,కార్యదర్శులు తాళ్ల సోమలింగం గౌడ్, సీహెచ్ సాయిరెడ్డి తెలిపారు.

బడిబాటలో పాల్గొన్న జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు

కాశీలో శివలింగార్చనకు పార్థివ లింగాల తయారీ

తయారు చేసిన లింగాలతో ఆలయాల ప్రతినిధులు, మహిళా భక్తులు

శక్కర్‌నగర్, జూన్ 11: కార్తీక మాసంలో కాశీ మహాక్షేత్రంలో నిర్వహించే కోటి పార్థివ లింగార్చనకు గాను బోధన్ పట్టణంలోని నగరేశ్వర ఆలయం, శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయాల్లో పలువురు మహిళా భక్తులు మట్టితో లింగాలను తయారు చేస్తున్నారు. బోధన్ పట్టణానికి చెందిన వ్యక్తితోపాటు, పలువురు భక్తులు కాశీ నుంచి తెచ్చిన మట్టిని వీరికి అందజేసి, లింగాలు తయారీ చేయాలని సూచించారు. ఇది తమ అదృష్టంగా భావించిన మహిళా భక్తులు ఇప్పటి వరకు 500 లింగాలను తయారు చేశారు. రెండువేల లింగాలు త్వరలో పంపుతామని, ఈ కార్యక్రమంలో పాలుపంచుకునేందుకు ఆర్యవైశ్య మహిళలు, వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయం, నగరేశ్వర ఆలయానికి రావాలని కోరారు.

సమాజ సేవలో భాగస్వాములు కావాలి

మాట్లాడుతున్న ఎన్‌పీడీసీఎల్ చీఫ్ ఇంజినీర్ రామకృష్ణ

బోధన్, జూన్ 11: ప్రతి ఉద్యోగి సమాజసేవలో భాగస్వామి కావాలని ఎన్‌పీడీసీఎల్ (టాన్స్‌కో) నిజామాబాద్ చీఫ్ ఇంజినీర్ సలంద్ర రామకృష్ణ అన్నారు. బోధన్ పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం పంచాయతీరాజ్ శాఖలో 39 ఏండ్లు పనిచేసిన పట్టణానికి చెందిన మందుగుల విద్యాసాగర్ ఉద్యోగ విరమణ సందర్భంగా నిర్వహించిన సన్మానసభలో ఆయన మాట్లాడారు. మందుగుల విద్యాసాగర్, పద్మ దంపతులను ఆయన పంచాయతీరాజ్ నిజామాబాద్ ఎస్ఈ ప్రభాకర్, బోధన్ తెలంగాణ జేఏసీ చైర్మన్ పి.గోపాల్‌రెడ్డి, పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్ తదితరులతో కలిసి సత్కరించారు.

దివ్యాంగులకు ఇచ్చిన హామీని అమలు చేయాలి



మాట్లాడుతున్న కోర్ కమిటీ చైర్మన్ గోపాల్ రావు

శక్కర్‌నగర్, జూన్ 11: దివ్యాంగులకు రూ. 4016 పింఛన్‌ను రూ.6వేలకు పెంచుతామని, వితంతువులు, వృద్ధులకు రూ. 4వేలు ఇస్తానని ఎన్నికల ముందు చెప్పి ఇప్పటికీ అమలు చేయకపోవడం శోచనీయమని వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ కోర్ కమిటీ చైర్మన్ సి.గోపాల్ రావు డిమాండ్ చేశారు. మంగళవారం బోధన్ మండలంలోని బెల్లాల్ గ్రామంలో ఏర్పాటు చేసిన వీహెచ్‌పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ, రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జహంగీర్, ఉపాధ్యక్షుడు నారాయణ, నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ఏర్గట్ల, జూన్ 11: మండలంలోని తాళ్ల రాంపూర్‌కు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త శివరాత్రి రవి కుటుంబానికి పులువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు రూ.60వేలు పోగుచేసి మంగళ వారం అందజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు ఎనుగందుల రాజాపూర్ణానందం, కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాగులపల్లి అంజిరెడ్డి, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బోనగిరి రమేశ్, తాజామాజీ సర్పంచ్ భీమనాతి భానుప్రసాద్, పార్టీ నాయకులు, రాజు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం ఏర్పాటు అభినందనీయం

బోధన్ రూరల్,జూన్ 11: సాలూర మండల కేంద్రంలో అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం(లైబ్రరీ)ని ఏర్పాట చేయాడం అభినందనీయమని ప్రముఖ సంఘ సేవకురాలు సరోజినమ్మ అన్నారు. మంగళవారం ఆమె అంబేద్కర్ విజ్ఞాన కేంద్రాన్ని సందర్శించారు. అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం అభివృద్ధి, పాఠశాలలో సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. కార్యక్రమంలో లైబ్రరీ కమిటీ ప్రధాన కార్యదర్శి లింబూరి లక్ష్మణ్, పాండు, బొర్ర గంగారాం, కేజీ గంగారాం తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు చేరిన పాఠ్య పుస్తకాలు

రుద్రూర్, జూన్11: ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభం అవుతున్న నేపథ్యంలో రుద్రూర్ మండల విద్యావనరుల కేంద్రానికి మంగళవారం పాఠ్య పుస్తకాలు వచ్చాయి. రెండో దఫా 16,450, మొదటి విడుతలో 7వేల పాఠ్యపుస్తకాలను అందజేసినట్లు సిబ్బంది తెలిపారు.

సంక్షిప్తంగా..

- **చెట్లను నరికితే కఠిన చర్యలు** - ఆర్మూర్‌టౌన్,జూన్11: చెట్లను నరికితే కఠిన చర్యలు తప్పవని ఎంపీడీవో సాయిరాం హెచ్చరించారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సాయిరాం మంగళవారం విలేకరులతో మాట్లాడారు. చెట్లను కొట్టి వేయాల్సి వస్తే అటవీశాఖ అధికారుల అనుమతి తీసుకోవాలని సూచించారు. చెట్లను పెంచాలనుకుంటే వారు గ్రామ పంచాయతీ కార్యదర్శికి చెప్పాలని, నర్సరీ నుంచి ఇంటికి మొక్కలను అందజేస్తామని పేర్కొన్నారు.
- **అంతర్రాష్ట్ర సరిహద్దులో పకడ్బందీగా తనిఖీలు**- రెంజ